## క్లుప్తంగా

### శివుడు, వినాయకుడికి ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

కలువాయి: స్థానిక పీహెచ్‌సీలో పునర్నిర్మించిన శివుడు, వినాకయుడి ఆలయాల్లో బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. విగ్రహాలు శిథిలావస్థకు చేరడంతో ఆరోగ్య విస్తరణాధికారి బాల కొండయ్య స్థానికుల సహకారంతో పునర్నిర్మించారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని నూతన దేవతా మూర్తుల విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు.

### కలువాయిలో భూముల రీసర్వే



రామన్నగారిపల్లిలో పొలాలు, రికార్డులను పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

కలువాయి: మండలంలోని మాదన్నగారిపల్లి, రామన్నగారిపల్లి గ్రామాల్లో బుధవారం రెవెన్యూ అధికారులు రీ సర్వే చేశారు. రెండు గ్రామాలకు చెందిన పేదలకు 1986లో ప్రభుత్వం 465 ఎకరాల భూములు పంచిపెట్టింది. రీసర్వేలో వాటిని ప్రభుత్వ భూములుగా మార్చారు. దీంతో లబ్ధిదారులు వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో ఆత్మకూరు ఆర్డీవో పావని ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది విచారణ జరిపారు. బాధిత రైతుల పట్టాదారు పాస్ పుస్తకాలను పరిశీలించారు. రెవెన్యూ రికార్డులు కంప్యూటరీకరణ చేయకముందే భూములను రైతులకు ఇచ్చినట్టు రికార్డుల్లో నమోదై ఉన్న విషయం కూడా అధికారుల పరిశీలనలో వెలుగుచూసింది. విచారణ గురువారం కూడా కొనసాగుతుందని పూర్తయిన తర్వాత ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని రెవెన్యూ సిబ్బంది తెలిపారు.

### ఆటో డ్రైవర్ కుటుంబానికి ఆర్థిక సాయం



డ్రైవర్ కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న ఆటో డ్రైవర్లు

ఓజిలి: ఓజిలి ఆటో స్టాండ్‌కు చెందిన డ్రైవర్ పండ్లూరు పెంచలయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ క్రమంలో తోటి ఆటో డ్రైవర్లు సాయం చేయాలని నిర్ణయించుకున్నారు. సీఐటీయూ గౌరవ అధ్యక్షుడు ఎస్కే మహబూబ్ బాషా, కమిటీ సభ్యులతో కలిసి బుధవారం కుటుంబ సభ్యులకు నగదు అందజేశారు. వారికి ధైర్యం చెప్పారు. కమిటీ సభ్యులు ఇస్మాయిల్, శ్రీనివాసులు, జంషిద్ అహ్మద్, నాగూర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

### గూడూరు రైల్వే స్టేషన్ తనిఖీ



గూడూరు రైల్వే స్టేషన్‌లో వసతులను పరిశీలిస్తున్న డీఆర్‌ఎం నరేంద్రపాటిల్

చిల్లకూరు : గూడూరు రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రతిపాదనలు పంపాలని విజయవాడ రైల్వే డీఆర్‌ఎం నరేంద్ర పాటిల్ ఆదేశించారు. ఆయన బుధవారం గూడూరు రైల్వే స్టేషన్‌ను తనిఖీ చేశారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్లాట్ ఫాంలు, ప్రయాణికులకు కల్పించాల్సిన వసతులపై అధికారులతో చర్చించారు. ప్రతిపాదనలు పంపాలని, ఉన్నతాధికారులతో చర్చల అనంతరం నిధులు కేటాయిస్తామన్నారు. అనంతరం స్టేషన్‌లో సిగ్నలింగ్ వ్యవస్థను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసారు. స్టేషన్ సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

### పేదలకు పంపిణీ చేయని రేషన్ సరుకులు

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట మండలంలోని రాచర్లవడ్డి కండ్రిగ, రామారత్నం కాలనీ, గొట్టిప్రోలు గ్రామాల్లోని పలు కాలనీలకు ఈ నెల రేషన్ సరుకులు పంపిణీ చేయలేదు. రేషన్ బియ్యం కోసం 26వ తేదీ వరకు ఎదురు చూసినా ఫలితం లేదు. అధికారులు సమాధానం ఇవ్వలేదు. ప్రతి నెలా రేషన్ బియ్యంలో 20 కేజీలకు గాను 2 నుంచి 3 కేజీల వరకు తూకంలో తక్కువగా ఇస్తున్నట్లు కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఈ నెల రేషన్ పంపిణీ చేయకపోవడంపై సివిల్ సప్లయీస్ డీటీ గోపీనాథ్‌రెడ్డి వివరణ ఇస్తూ ఈ నెల రేషన్ తక్కువగా రావడంతో కొన్ని గ్రామాలకు పంపిణీ చేయలేదన్నారు. ఈ విషయాన్ని రేషన్ డీలర్లు రాత పూర్వకంగా తెలియజేశారని, వాటిని జిల్లా డీఎస్‌వోకు పంపినట్లు వివరించారు. మార్చి నెలలో అందరికీ రేషన్ పంపిణీ చేసేలా చర్యలు చేపట్టామని తహసీల్దారు రాజేంద్ర తెలిపారు.

చిల్లకూరు : చేడిమాల నాగలింగేశ్వర స్వామికి పూజలు



నాయుడుపేట: భూపతేశ్వరస్వామి నగరోత్సవం



చిట్టమూరు : కామాక్షీదేవి, రామలింగేశ్వర స్వామి



కోట: గూడలిలో పూజలు చేస్తున్న మహిళలు



సైదాపురం : సిద్ధలయ్య కోనలో పూజలు



# హర హర మహాదేవ..

- ఘనంగా శివరాత్రి ఉత్సవాలు
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- ఊరూవాడా ప్రత్యేక పూజలు

శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం శైవ క్షేత్రాలు శివనామస్మరణతో మారుమోగాయి. అన్ని ప్రాంతాల్లోనూ పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచి ఉపవాసం ఉండి ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి జాగారం చేశారు. శివపార్వతులకు శాస్త్రోక్తంగా కల్యాణం చేశారు. స్వామి, అమ్మవార్ల గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం ధాన్యాధివాసం, పుష్పాధివాసం, దర్బారు సేవ చేపట్టారు. హోమాలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించారు. ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. పోలీసులు బందోబస్తు చేపట్టారు.



పెళ్లకూరు : చింతపూడిలో పార్వతీపరమేశ్వరులకు గ్రామస్తుల పూజలు



సూళ్లూరుపేట : సంతానేశ్వరసామిని అభిషేకించేందుకు కాళంగినది నుంచి జలం తెస్తున్న భక్తులు



సూళ్లూరుపేట : కాళంగినదిలో ఏర్పాటుచేసిన సైకత లింగం

### సంతానేశ్వరస్వామికి జలాభిషేకం

సూళ్లూరుపేట : పట్టణంలోని మన్నారు పోలూరు బీసీ కాలనీ సమీపంలో కాళంగినదీ తీరాన వెలసిన శ్రీసంతానేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి బుధవారం వేకువజాము నుంచే కాళంగి నదీ జలాలలో స్వామి వారిని అభిషేకించారు. కాళంగి నది నుంచి ఇసుక తీసుకొచ్చి ఆలయప్రాంగణంలో సైకత లింగాన్ని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు.



మూలవిరాట్టు శివలింగానికి 108 లీటర్లతో పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

చిల్లకూరు: మండలంలోని లింగవరంలోని వ్యాఘ్రేశ్వరస్వామి ఆలయంలో ఏఎంసీ మాజీ చైర్మన్ యరటపల్లి జానకిరామిరెడ్డి, తూర్పుకనుపూరులోని కామాక్షి సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద ఎత్తున అన్నదానం చేశారు. చేడిమాలలోని కామాక్షి సమేత నాగమల్లేశ్వర స్వామి ఆలయం, బూదనంలో అన్నదానం చేశారు.

**సైదాపురంలో..**

సైదాపురం: మండలంలోని సిద్ధలయ్య కోన, సైదాపురం శివాలయం, బాలాత్రిపుర సుందరీ దేవి ఆలయాల్లో ఉన్న శైవక్షేత్రాల్లో శివరాత్రి పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఊటుకూరు, తురిమెర్ల, గిద్దలూరు, కలిచేడు గ్రామాల్లో స్వామి, అమ్మవార్ల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. అన్నదానం చేశారు.

**రాపూరులో..**

రాపూరు: రాపూరులోని రామనాథేశ్వరస్వామి ఆలయంలో విశేష పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. రాత్రి శివపార్వతుల కల్యాణం చేశారు. ఆకలివలస సమీపంలోని బుగ్గేశ్వర, మామిడికోన సిద్ధిలేశ్వరకోనలో శివునికి ప్రత్యేక పూజలు చేశారు.

**కలువాయిలో..**

కలువాయి: కలువాయిలోని రాజరాజేశ్వరీ సమేత నీలకంఠేశ్వర స్వామి, యదనపర్తిలోని పార్వతీ సమేత శ్రీకంఠ మల్లేశ్వర స్వామి, బద్దెవోలులోని రాధామాధవ రామలింగేశ్వర స్వామి, కుల్లూరు గంగాధరేశ్వర ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. గ్రామోత్సవం, లింగోద్భవ పూజలు నిర్వహించారు.

**ఓజిలిలో..**

ఓజిలి: మండలంలోని భట్లకనుపూరులోని జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయంలో గున్నం సేవాట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంపై శిఖరదీపాలు వెలిగించారు. సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, గున్నం రెడ్డి రాధారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, బచ్చల రవీంద్రర్ రెడ్డి, ఎంపీపీ గడ్డం అరుణారెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి దంపతులు, సర్పంచ్ ఉమామహేశ్వరి ఏర్పాట్లు చేశారు.

**తడలో..**

తడ: మాంబట్టులోని గంగా అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి, వాటంబేడు, వేనాడులోని శివాలయాలు, తడకండ్రిగ పంచాయతీ బీఎల్ పాడు లోని భువనేశ్వరి సమేత భువనేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కామిరెడ్డి వెంకురెడ్డి, ప్రసూన దంపతులు, పాముల రాజయ్య, శకుంతలమ్మ దంపతులు అన్న దానం చేశారు. బీఎల్‌పాడులో భువనేశ్వర స్వామి చందనాలంకరణలో దర్శనమిచ్చారు.

**నాయుడుపేటలో..**

నాయుడుపేట టౌన్ : పట్టణంలోని స్వర్ణముఖి నదీ తీరాన ఉన్న ప్రసూనాంబ సమేత నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. విన్నమాలలోని వెంకటేశ్వర స్వామి, పుదూరు సమీపంలోని హనుమదీశ్వర స్వామి, తిమ్మాజికండ్రి సమీపంలోని దుర్గామల్లేశ్వర స్వామి, తుమ్మూరులోని గంగా కామాక్షి దేవి సమేత నీలకంఠేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జువ్వలపాళెం నుంచి గౌరి దేవి సమేత భూపతేశ్వర స్వామి నగరోత్సవాన్ని వేడుకగా జరిపారు. స్వామి అమ్మవార్లను ఊరేగింపుగా చిట్టమూరు మండలంలోని యాకశిరి తిప్పలోని భూపతేశ్వర స్వామి ఆలయానికి తీసుకెళ్లారు.

**దొరవారిసత్రంలో..**

దొరవారిసత్రం : మండలంలోని శ్రీధనమల్లి, వేణుంబాకం, అక్కరపాక, కల్లూరు, ఉచ్చూరు, మేలుపాక తదితర గ్రామాల్లోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు.

**పెళ్లకూరులో..**

పెళ్లకూరు : మండలంలోని చింతపూడి, చెంబేడు, పెళ్లకూరు, నెలబల్లి, రోసనూరు, పాలచ్చూరు గ్రామాల్లో శివాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. శివలింగాలకు పాలాభిషేకం చేశారు. భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం చేశారు.

**సూళ్లూరుపేటలో..**

సూళ్లూరుపేట: పట్టణంలోని గంగా పార్వతి సమేత నాగేశ్వర స్వామి ఆలయంలో పంచాహ్నిక బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. బుధవారం ఉదయం 108 లీటర్ల పాలతో అభిషేకం చేశారు. అన్నదానం చేశారు. బస్టాండ్ సెంటర్‌లోని అభయ శంకరుని స్వామి, కొరిడిలో వున్న శ్రీవననీల కంఠేశ్వర స్వామి, కోటపోలూరులోని ఖరేశ్వరస్వామి, దామానెల్లూరులోని ధవశేశ్వరస్వామి, కుదిరిలోని శ్రీకాశీ విశ్వేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

**చిట్టమూరులో..**

చిట్టమూరు : మల్లాం, చిట్టమూరు, మెట్టు, పాటిమిట్ట శివాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. యాకసిరి తిప్పపై వున్న గౌరీ సమేత భూపతీశ్వర స్వామిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. రాత్రి స్వామి, అమ్మవార్ల కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.

**కోటలో..**

కోట: మండలంలోని గూడలి సంగమేశ్వర స్వామి, గూడలి కొండపై వెలసిన భీమేశ్వర స్వామి, కోటలోని సోమేశ్వర స్వామి, అల్లంపాడులోని అగస్తీశ్వర స్వామి, వంజివాక జలసిద్ధేశ్వర స్వామి, పుచ్చలపల్లిలోని శ్రీకాళహస్తీశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయాలకు పోటెత్తారు.

**వెంకటగిరిలో..**

వెంకటగిరి రూరల్ : వెంకటగిరిలోని కై వల్యానది తీరం వద్ద ఉన్న శ్రీ పర్వత వర్ధినీ సమేత రామలింగేశ్వరస్వామి, కాశీవిశ్వనాథస్వామి, కర్ణకమ్మ వీధిలోని హరిహర క్షేత్రం, బంగారుపేట భవానీ శంకరాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. వెంకటగిరి రూరల్‌లోని జంగాలపల్లిలోని వీరభద్ర స్వామి గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం స్వామికి ఖడ్గంతో పూజలు చేశారు. పారవోలులోని అన్నపూర్ణ సమేత విశ్వనాథస్వామి ఆలయంలో మహిళల కోలాటాలు ఆకట్టుకున్నాయి.

**బాలాయపల్లిలో..**

బాలాయపల్లి(సైదాపురం) : బాలాయపల్లి మండలంలోని సుబ్రమణ్యం స్వామి, కోటంబేడు, జయంపు, పెరిమిడి గ్రామాల్లో ఉన్న శివాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. షణ్ముగ సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయంలో శివ పార్వతుల గ్రామోత్సవాన్ని ఘనంగా చేపట్టారు.

**దక్కిలిలో..**

దక్కిలి: స్తంభాలగిరీశ్వరయ్యస్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్లకు పొంగళ్లు పెట్టారు. ఈవో శ్రీనివాసులు భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. రాత్రి శివపార్వతుల కల్యాణాన్ని వైభవంగా చేపట్టారు. వడ్ల మోపూరు, ఎగువ లింగసముద్రం గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

**గూడూరులో..**

గూడూరు రూరల్ : గూడూరు రెండో పట్టణంలోని చింపిరి నాయుడుపేటలోని కామాక్షిదేవి సమేత ఉమామహేశ్వరస్వామి, త్యాగరాజ వీధిలోని సోమేశ్వరస్వామి తదితర శివాలయాల్లో రుద్రాభిషేకం చేశారు. ప్రత్యేక పూజలు చేశారు.

**వాకాడులో..**

వాకాడు : మండలంలోని పంట్రంగంలోని పురాతన పాండురంగేశ్వరస్వామి, వాకాడులోని శ్రీ నాగేశ్వర స్వామి, జువ్వినట్టులోని కాశీ విశ్వేశ్వరస్వామి, తిరుమూరులోని భీమేశ్వరస్వామి, వెంకటరెడ్డిపాళెంలోని జలసిద్ధేశ్వరస్వామి, యరగాటిపల్లిలోని శ్రీకాళహస్తీశ్వరస్వామి, తూపిలిలో బ్రహ్మలింగేశ్వర స్వామి, మొలగనూరు కాశీ విశ్వనాథస్వామి, కల్లూరు, కొండాపురంలో భీమేశ్వరస్వామి, దుగ్గరాజ పట్నం, తూపిలిపాళెం శివాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు సముద్ర స్నానం ఆచరించి దీపాలు వెలిగించారు.



సూళ్లూరుపేట : సంతానేశ్వరస్వామిని అభిషేకించేందుకు క్యూలో వేచివున్న భక్తులు



సూళ్లూరుపేట : ఆలయంలో తామరపద్మంలో కాళంగినదీ జలాలను పోస్తున్న భక్తులు



నాయుడుపేట టౌన్ : నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో హోమం



తడ: మాంబట్టు శివాలయం వద్ద గోపూజ చేస్తున్న ఆలయ నిర్వాహకులు



రాపూరు శివాలయం వద్ద అన్నదానం



రాపూరు: సిద్ధిలేశ్వర కోనలో కిక్కిరిసిన భక్తులు



కలువాయి శివాలయంలో స్వామివారి కల్యాణం



ఓజిలి: వెండి కిరీటం, వస్త్రాలను తీసుకొస్తున్న మధురెడ్డి, ఎంపీపీ అరుణారెడ్డి

## జామాయిల్ కలప తరలింపునకు యత్నం

చిల్లకూరు : మండలంలోని ఎగువరాజుపాళెం గ్రామంలోని అగ్రిగోల్డ్ భూముల్లో గతంలో నరికేసిన జామాయిల్ కలపను బుధవారం కొంతమంది అక్రమంగా తరలించేందుకు ప్రయత్నించారు. స్థానికులు రెవెన్యూ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు అడ్డుకున్నారు. ఎగువరాజుపాళెంలో అగ్రిగోల్డ్‌కు సుమారు 500 ఎకరాల భూములు ఉన్నాయి. వీటిలో వివిధ రకాల కలప ఉంది. ఇటీవల కొంతమంది 15 ఎకరాల్లోని జామాయిల్ చెట్లను నరికేసి కలపను తరలించేందుకు ప్రయత్నించారు. స్థానికుల సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకుని మూడు లారీలను స్వాధీనం చేసుకున్నారు. గుర్తు తెలియని వ్యక్తులపై కేసులు నమోదు చేశారు. ఈ క్రమంలో మహాశివరాత్రి సెలవు కావడంతో గతంలో నరికేసిన రూ.లక్షల విలువైన కలపను తరలించేందుకు ప్రయత్నించారు. స్థానికులు రెవెన్యూ అధికారులకు తెలపడంతో వారు అడ్డుకున్నారు. ఇంత జరుగుతున్నా అగ్రి గోల్డ్ భూములపై విచారణ చేస్తున్న సీఐడీ అధికారులు పట్టించుకోకపోవడంపై పలు విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.



అగ్రిగోల్డ్ భూముల్లో గతంలో నరికి వేసిన జామాయిల్ చెట్లు, అక్కడే ఉన్న కలప

## రైతులకు పశుగ్రాసం నారు పంపిణీ

చిల్లకూరు : తీరప్రాంతంలోని తమ్మినపట్నం గ్రామంలోని రైతులుకు బుధవారం అదానీ క్రిష్ణపట్నం పోర్టు ఫౌండేషన్ ప్రాజెక్టు ప్రతినిధులు కామధేను కార్యక్రమం సూపర్ నేపియర్ గ్రాస్ నారు అందజేశారు. అలాగే ద్వారా తీర ప్రాంతంలోని పాడి రైతులకు పశుగ్రాసం పెంపకంపై ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ ప్రతినిధులు ఒక్క రోజు శిక్షణ ఇచ్చారు. అదాని ఫౌండేషన్ వ్యవసాయధికారి షేక్ సాహుల్ హమీద్ మాట్లాడుతూ సూపర్ నేపియర్ గ్రాస్‌ను ఇంటి పెరటిలో పెంచుకోవచ్చన్నారు. నారును మూర పొడవు ఉండేలా కట్ చేసి భూమిలో పాతితే ఆరు నెలల్లో పెద్ద మొక్కలా ఎదుగుతుందన్నారు. దీన్ని కత్తిరించి పాడి పశువులకు పచ్చి మేతగా వేస్తే పాల దిగుబడి పెరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో సీఈవో వెంకటేశ్వర్లు, కోశాధికారి షేక్ షఫీ, ఎగ్జిక్యూటివ్, సాయినాథ్, మృత్యుంజయరాం తదితరులు పాల్గొన్నారు.



గడ్డి కత్తిరింపుపై శిక్షణ ఇస్తున్న అధికారులు

## పల్లెల్లో తీవ్రంగా తాగునీటి సమస్య

వాకాడు : మండలంలోని వివిధ గ్రామాల్లో తాగునీటి సమస్యతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాకాడు స్వర్ణముఖి నది ఒడ్డున ఉన్న రక్షిత మంచి నీటి పథకం ద్వారా జువ్వినట్లు, దుగ్గరాజపట్నం, నిడిగుర్తి, రావిగుంటపాళెం, తిరుమూరు, వాకాడు పంచాయతీలకు తాగునీరు సరఫరా కావాల్సి ఉంది. వారం క్రితం పైపులు పగిలిపోవడంతో నీటి సరఫరా ఆగిపోయింది. దీంతో ఆయా పంచాయతీల ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడుతున్నారు. ప్రత్యామ్నాయంగా ట్యాంకర్లతో అరకొరగా అందిస్తున్నారు. కూలి పనులు మానుకుని ట్యాంకర్ల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. గ్రామాల్లో కూటమి నేతలు తమకు అనుకూలంగా ఉండే వారికి ప్రాధాన్యం ఇచ్చి నీటిని సరఫరా చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయమై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుమాంజలిని వివరణ కోరగా నీటి ఒత్తిడి వలన పైపులు పగిలిపోయాయన్నారు. నదిలో నీరు ఉండడం వలన పైపుల మరమ్మతులు చేయలేకపోతున్నామని తెలిపారు. ప్రత్యామ్నాయంగా తిరుమూరు, వాకాడు జనార్దన్‌రెడ్డి కాలనీ, దుగ్గరాజపట్నం గ్రామాలకు ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తున్నామన్నారు. త్వరలోనే పైపుల మరమ్మతులు పూర్తి చేసి తాగునీటిని సరఫరా చేస్తామన్నారు.



తిరుమూరులో ట్యాకర్ వద్ద నీటి కోసం గొడవ పడుతున్న ప్రజలు

## డీవీ సత్రంలో దొంగల హల్‌చల్

దొరవారిసత్రం : మండలంలోని దొరవారిసత్రం పరిధిలోని జాతీయ రహదారి వెంబడి ఉన్న వివిధ దుకాణాల వద్ద దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. మంగళవారం రాత్రి ఎవరూ గుర్తు పట్టకుండా ఉండేలా తలకు టోపీ, మొహం కనిపించకుండా రుమాలు, చేతికి గ్లౌజ్‌లు తొడుక్కున్న ఇద్దరు దుకాణంలో చోరీకి ప్రయత్నించారు. అక్కడున్న సీసీ కెమెరా సైరన్ మోగడంతో దుండగులు బైక్‌పై పరారయ్యారు. జాతీయ రహదారి వెంబడి ఉన్న పలువురి దుకాణాల్లో ఇటీవల వరుసగా చోరీలు జరుగుతున్నాయి. దీంతో దుకాణదారులు భయందోళన చెందుతున్నారు. మూడు రోజుల క్రితం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఒక వ్యక్తి బైక్ చోరీకి అయింది. గతంలోనూ అనేక బైక్‌లు చోరీకి గురయ్యాయి. పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



చోరీ చేసేందుకు రాడ్‌తో వస్తున్న గుర్తుతెలియని వ్యక్తి

### కండలేరులో 52.063 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో బుధవారం నాటికి 52.063 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. కండలేరు నుంచి సత్య సాయి గంగ కాలువకు 620, పిన్నేరు కాలువకు 120, లోలెవల్ కాలువకు 210, హైలెవల్ కాలువకు 210, మొదటి బ్రాంచ్ కాలువకు 70 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.